# المختصر في صفة العمرة وأحكامها

# (للحرمين)

# ఉమ్రా యొక్క విధానము

# మరియు దాని నియమ

# నిబంధనల సంక్షిప్త సంగ్రహం.

## ఉమ్రా యొక్క విధానము మరియు దాని నియమ నిబంధనల సంక్షిప్త సంగ్రహం.

మస్జిదె హరామ్ మరియు మస్జిదె నబవీ లలో ధార్మిక పరమైన వ్యవహారాల విభాగానికి చెందిన శాస్త్రీయ కమిటీ.

## ఉమ్రా యొక్క విధానము మరియు దాని నియమ నిబంధనల సంక్షిప్త సంగ్రహం.

స్థుతులన్ని సర్వలోకాల ప్రభువైన అల్లాహ్ కే, అల్లాహ్ మన ప్రవక్త అయిన ముహమ్మద్ పై, ఆయన కుటుంబముపై, ఆయన సహచరులందరిపై శుభాలను, శాంతిని కురిపించుగాక.

అమ్మా బాద్:

ఇది ఉమ్రా విధానం నియమాలు మరియు మర్యాదలను వివరించే ఒక సంక్షిప్త సందేశం. ఇందులో ఉమ్రా యాత్రికుడికి అవసరమయ్యే దాదాపు అన్ని ముఖ్యమైన విషయాలను వివరించడానికి మేము ప్రత్యేక శ్రద్ధ వహించాము.

అల్లాహ్ ఈ కార్యాన్ని కేవలం తన పవిత్ర ప్రీతి కోసం నిష్కల్మషమైనదిగా చేయాలని మరియు దీని ద్వారా ముస్లింలందరికీ మేలు చేకూర్చాలని మేము ప్రార్థిస్తున్నాము.

మస్జిద్ అల్-హరామ్ (మక్కా) మరియు మస్జిద్ అన్-నబవీ (మదీనా) యొక్క ధార్మిక వ్యవహారాల అధ్యక్షతలో ఉన్న అధికారిక శాస్త్రీయ కమిటీ

## పరిచయం

## మొదటిగా: ఆరాధన స్వీకరించబడటానికి అవసరమైన షరతులు

మహోన్నతుడైన అల్లాహ్ వద్ద ఆరాధన స్వీకరించబడాలంటే రెండు షరతులు తప్పనిసరి:

నిష్కల్మషమైన చిత్తశుద్ధి (ఇఖ్లాస్): అంటే తాను చేసే ఆరాధన ద్వారా అల్లాహ్ ప్రసన్నతను మరియు పరలోక విజయాన్ని మాత్రమే ఆశించడం. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿وَمَآ أُمِرُوٓاْ إِلَّا لِيَعۡبُدُواْ ٱللَّهَ مُخۡلِصِينَ لَهُ ٱلدِّينَ حُنَفَآءَ...﴾[1]

మరియు వారికిచ్చిన ఆదేశం: "వారు అల్లాహ్ నే ఆరాధించాలని, పూర్తి ఏకాగ్ర చిత్తంతో తమ ధర్మాన్ని (భక్తిని) కేవలం ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలని...[1] [అల్ బయ్యినహ్: 5]

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రవచించారు:

«إِنَّمَا الْأَعْمَالُ بِالنِّيَّاتِ، وَإِنَّمَا لِكُلِّ امْرِئٍ مَا نَوَى».

[1] అర్థం: ఆయన (అల్లాహ్) వైపు ముఖం చేసి, ఆయన ఆరాధనలో నిమగ్నమై, ఆయన తప్ప ఇతర వాటిని విస్మరిస్తూ ఉండటం." తఫ్సీర్ అస్-సఅదీ (పేజీ 538)

«నిశ్చయంగా కార్యాలు, కర్మలు వాటి సంకల్పాలపై ఆధారపడి ఉంటాయి. ప్రతి వ్యక్తికి అతని సంకల్పానుసారంగా ప్రతిఫలము లభిస్తుంది.»[1].

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను మాటల్లో మరియు చర్యల్లో అనుసరించటం. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

«مَنْ أَحْدَثَ فِي أَمْرِنَا هَذَا مَا لَيْسَ فِيهِ فَهُوَ رَدٌّ»

"ఎవడయినా మా ఈ ధర్మం విషయంలో దీనికి సంబంధించని కొత్త విషయమేదైనా ఆవిష్కరిస్తే అది త్రోసి పుచ్చబడుతుంది".[2] మరొక హదీసులో ఇలా ఉంది:

«مَنْ عَمِلَ عَمَلًا لَيْسَ عَلَيْهِ أَمْرُنَا فَهُوَ رَدٌّ».

ఎవరైనా నా ఆదేశం లేని ఏదైన ఆచరణ (ధర్మం అనుకుని) చేస్తే అది తిరస్కరించబడును.[3]

***

---

[1] దీనిని బుఖారీ ఉల్లేఖించారు హదీసు సంఖ్య (1) మరియు ముస్లిం ఉల్లేఖించారు హదీసు సంఖ్య (1907).

[2] దీనిని బుఖారీ ఉల్లేఖించారు హదీసు సంఖ్య (2697) మరియు ముస్లిం ఉల్లేఖించారు హదీసు సంఖ్య (1718).

[3] దీనిని ముస్లిం ఉల్లేఖించారు హదీసు సంఖ్య (1718)

## రెండవది: ఉమ్రా యొక్క విధానం మరియు దాని నియమ నిబంధనలను నేర్చుకోవడం యొక్క ఆదేశం.

అల్లాహ్‌కు ఆరాధన చేయదలచినవాడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మార్గదర్శకాన్ని నేర్చుకోవడం అవసరం. తద్వారా వారు చేసే పని సున్నత్ కు అనుగుణంగా ఉంటుంది. ప్రజలు తనను అనుసరించాలని మరియు తన మార్గదర్శకత్వాన్ని పాటించాలని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా ప్రోత్సహించేవారు. మాలిక్ బిన్ హువైరిస్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించిన హదీస్‌లో, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:

«صَلُّوا كَمَا رَأَيْتُمُونِي أُصَلِّي».

మీరు నన్ను ఏవిధంగా నమాజ్ పాటిస్తుండగ చూశారో ఆవిధంగా నమాజ్ పాటించండి".[1]

జాబిర్ రజియల్లాహు అన్హు ఉల్లేఖనం:

«رَأَيْتُ النَّبِيَّ ﷺ يَرْمِي عَلَى رَاحِلَتِهِ يَوْمَ النَّحْرِ وَيَقُولُ: لِتَأْخُذُوا مَنَاسِكَكُمْ، فَإِنِّي لَا أَدْرِي لَعَلِّي لَا أَحُجُّ بَعْدَ حَجَّتِي هَذِهِ».

నేను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను యౌమున్నహర్ (ఖుర్బానీ పండుగ) రోజున తన ఒంటెపై కూర్చొని (జమరాత్ వద్ద) రాళ్లు విసురుతూ ఉండగా చూశాను. ఆయన ఇలా అన్నారు:

---

[1] దీనిని బుఖారీ ఉల్లేఖించారు,, హదీసు సంఖ్య (6008)

"మీరు మీ హజ్ విధులను నా నుండి నేర్చుకోండి, ఎందుకంటే ఈ హజ్ తర్వాత నేను మరో హజ్ చేయగలనో లేదో నాకు తెలియదు.[1]

***

## మూడవది: ఉమ్రా యొక్క విశిష్టత

ఉమ్రాకు రెండు రకాల విశిష్టతలు ఉన్నాయి: సాధారణమైనవి మరియు ప్రత్యేకమైనవి.

సాధారణమైన విశిష్టత: అబూ హురైరహ్ రజియల్లాహు అన్హు ఉల్లేఖనం, "ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రవచించారు:

«الْعُمْرَةُ إِلَى الْعُمْرَةِ كَفَّارَةٌ لِمَا بَيْنَهُمَا، وَالْحَجُّ الْمَبْرُورُ لَيْسَ لَهُ جَزَاءٌ إِلَّا الْجَنَّةَ».

«ఒక ఉమ్రా తర్వాత మరొక ఉమ్రా చేయటం వాటి మధ్య జరిగిన పాపాలన్నిటికీ పరిహారం అవుతుంది. మరియు మబ్రూర్ (ఆమోద ముద్రపడిన) హజ్ కు ప్రతిఫలం స్వర్గం తప్ప మరేమి లేదు.»[2]

అబ్దుల్లాహ్ ఇబ్నె మస్'ఊద్ రజియల్లాహు అన్హు ఉల్లేఖనం: "రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రవచించారు:

«تَابِعُوا بَيْنَ الْحَجِّ وَالْعُمْرَةِ، فَإِنَّهُمَا يَنْفِيَانِ الْفَقْرَ وَالذُّنُوبَ كَمَا يَنْفِي الْكِيرُ خَبَثَ الْحَدِيدِ وَالذَّهَبِ وَالْفِضَّةِ، وَلَيْسَ لِلْحَجِّ الْمَبْرُورِ ثَوَابٌ إلا الْجَنَّةُ».

మీరు హజ్ మరియు ఉమ్రాలను ఒకదాని వెంట ఒకటి (తరచుగా) చేస్తూ ఉండండి. ఎందుకంటే, కొలిమి గల ఇనుము, బంగారం

---

[1] దీనిని ముస్లిం ఉల్లేఖించారు హదీసు సంఖ్య (1297)

[2] దీనిని బుఖారీ ఉల్లేఖించారు హదీసు సంఖ్య (1773) మరియు ముస్లిం ఉల్లేఖించారు హదీసు సంఖ్య (1349).

మరియు వెండిలోని మలినాలను ఎలా తొలగిస్తుందో, అలాగే ఈ రెండు (హజ్ మరియు ఉమ్రా) పేదరికాన్ని మరియు పాపాలను తొలగిస్తాయి. మరియు అల్లాహ్ చేత ఆమోదించబడిన హజ్ (హజ్-ఎ-మబ్రూర్) కు స్వర్గం తప్ప మరే ఇతర ప్రతిఫలం లేదు.[12]

మరియు రమజాన్‌లో ప్రత్యేక విశిష్టత: అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ రజియల్లాహు అన్హుమా ఉల్లేఖనం : "ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:

«عُمْرَةٌ فِي رَمَضَانَ تَقْضِي حَجَّةً مَعِي».

రమదానులో చేయబడే ఉమ్రా నాతో హజ్జ్ చేయడానికి సమానం.[3]

***

## ఉమ్రా విధానం

### మొదటగా: మీఖాత్‌ల ఆదేశాలు:

మీఖాత్‌లు: అనేవి, హజ్ లేదా ఉమ్రా చేయదలచిన వారు ఇహ్రామ్ ధరించడానికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నిర్ణయించిన ప్రదేశాలు.

---

[1] దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు హదీసు సంఖ్య (810) మరియు నసాయీ ఉల్లేఖించారు హదీసు సంఖ్య (2631).

[2] కమ్మరి నిప్పు రాజేసే ప్రదేశం (కొలిమి). (అల్-తమ్హీద్ - ఇబ్న్ అబ్దిల్ బర్ 15/102)

[3] దీనిని బుఖారీ ఉల్లేఖించారు హదీథు సంఖ్య (1863) మరియు ముస్లిం ఉల్లేఖించారు హదీథు సంఖ్య (1256).

కావున, హజ్ లేదా ఉమ్రా చేసే సంకల్పంతో ఈ (మీఖాత్) ప్రదేశాలలో దేనినైనా దాటి వెళ్లే వ్యక్తిపై, అక్కడ నుండి ఇహ్రామ్ కట్టడం తప్పనిసరి (వాజిబ్). ఇహ్రామ్ లేకుండా వాటిని దాటి వెళ్లడం అతనికి అనుమతించబడదు.

ఈ మీఖాత్ ల కంటే మక్కాకు సమీపంగా ఉన్నవారి కోసం, వారి మీఖాత్ వారి స్థలమే అవుతుంది. అందువల్ల, వారు హజ్జ్ లేదా ఉమ్రా చేయాలనుకుంటే, అదే స్థలం నుండి ఇహ్రాం ధరించాలి.

మక్కా నివాసులు మరియు అక్కడ నివసించే వ్యక్తులు హజ్‌కు మక్కా నుండే ఇహ్రాం కట్టుకోవాలి. ఉమ్రా కోసం, వారు 'హిల్' (హరం పరిధికి బయట ఉన్న ప్రాంతం)కు వెళ్లి అక్కడ నుండి ఇహ్రాం కట్టుకోవాలి, ఉదాహరణకు తన్ఈమ్ లేదా అలాంటి ప్రదేశాల నుండి.

విమానంలో ఉన్నవారు మీఖాత్‌కు సమాంతరంగా వచ్చినప్పుడు ఇహ్రాం ధరించాలి. అందువల్ల, వారు ముందుగా సిద్ధంగా ఉండాలి మరియు మీఖాత్‌కు చేరుకునే ముందు ఇహ్రాం వస్త్రాలను ధరించాలి. మీఖాత్‌కు చేరుకున్న వెంటనే ఇహ్రాం సంకల్పం చేసుకోవాలి. అయితే, విమానం వేగంగా ప్రయాణించే కారణంగా మీఖాత్‌ను దాటిపోయే ప్రమాదం ఉంటే, భద్రత కోసం కొద్దిగా ముందుగా తల్బియా చెప్పడం ఉత్తమం. విమానాశ్రయంలో దిగిన తరువాత ఇహ్రాం ధరించడం అనుమతించబడదు.

## రెండవది: ఇహ్రాం యొక్క విధానం మరియు దాని నియమాలు:

ఇహ్రాం కట్టుకోవడానికి ఉద్దేశించిన వ్యక్తి క్రింది విషయాలు చేయటం ధర్మబద్ధమైనవి:

స్నానం చేయడం (ఘుస్ల్), ఇది పురుషులు మరియు స్త్రీలు ఇద్దరికీ ఒక ఖచ్చితమైన సున్నత్ (సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఆచారం). ఇది రుతు స్రావం ఉన్న స్త్రీలు (హాయిద్) మరియు ప్రసవం తర్వాత ఉన్న స్త్రీలు (నుఫసా) కూడా చేయాలి.

ఇహ్రాం కట్టుకునే ముందు, వ్యక్తి తన తల మరియు గడ్డంపై అత్యుత్తమమైన సుగంధ ద్రవ్యాలను (అత్తరు, ఆయిల్ లేదా ఇతర సుగంధాలు) ఉపయోగించాలి. ఇహ్రాం కట్టుకున్న తర్వాత కూడా ఈ సుగంధం శరీరం పై మిగిలి ఉండటం ఎటువంటి హాని కలిగించదు. అయితే, స్త్రీలు సుగంధ ద్రవ్యాలను ఉపయోగించకూడదు, ఎందుకంటే ఆ వాసన పరాయి పురుషులకు తగలరాదు .

ఇహ్రామ్ వస్త్రాలను ధరించడం: పురుషుల ఇహ్రామ్ అంటే ఒక ఇజార్ (నడుముకు కట్టుకునే వస్త్రం) మరియు ఒక రిదా (శరీరం పైభాగంలో కప్పుకునే వస్త్రం). అవి తెల్లగా, శుభ్రంగా లేదా కొత్తవిగా ఉండటం సున్నత్. ఇక స్త్రీలు తమకు నచ్చిన వస్త్రాలను ధరించి ఇహ్రామ్ కట్టవచ్చు, కానీ అవి అలంకారాలతో కూడినవి (సౌందర్యాన్ని ప్రదర్శించేవి) కాకూడదు. అలాగే స్త్రీలు నిఖాబ్ (ముఖానికి కట్టుకునే ముసుగు) మరియు గ్లౌజులు (చేతి తొడుగులు) ధరించకూడదు; ముఖాన్ని మరియు చేతులను ఇతర

వస్త్రాలతో (అవసరమైనప్పుడు పరాయి పురుషుల నుండి) కప్పుకోవచ్చు.

ఏదైనా ఫర్జ్ నమాజు తర్వాత లేదా నఫిల్ నమాజు తర్వాత ఇహ్రామ్ కట్టడం సున్నత్. ( ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఆచారం). అయితే, ఇది తప్పనిసరి కాదు.

అతను ఇలా అనాలి: (లబ్బైక అల్లాహుమ్మ ఉమ్రతన్) ఓ అల్లాహ్! నీ పిలుపునందుకుని ఉమ్రా చేయడానికి సిద్ధంగా ఉన్నాను. ఒకవేళ అతను వేరొకరి తరపున ఉమ్రా చేస్తుంటే ఇలా అనాలి: (లబ్బైక అల్లాహుమ్మ ఉమ్రతన్ అన్ ఫులాన్) ఓ అల్లాహ్! ఫలానా వ్యక్తి తరపున ఉమ్రా చేయడానికి సిద్ధంగా ఉన్నాను.

ఒక వ్యక్తి ఇహ్రాం కట్టుకునే సమయంలో తన యాత్రను పూర్తి చేయడానికి ఏదైనా అడ్డంకి వస్తుందని భయపడితే, అతను ఇహ్రాం కట్టుకునే సమయంలో ఒక షరతు (షర్త్) విధించవచ్చు. అతను ఇలా చెప్పవచ్చు: '(... మరియు ఏదైనా అడ్డంకి నన్ను ఆపివేస్తే, నేను ఆపబడిన చోటనే ఇహ్రాం నుండి విముక్తి పొందుతాను.)' అతను ఈ షరతు విధించిన తర్వాత, ఏదైనా అడ్డంకి వస్తే, అతను ఇహ్రాం నుండి విముక్తి పొందవచ్చు మరియు అతనిపై ఎటువంటి పరిహారం లేదు.

అతడు ఎక్కువగా తల్బియా చెప్పాలి: "లబ్బైక అల్లాహుమ్మ లబ్బైక, లబ్బైక లా షరీక లక లబ్బైక, ఇన్నల్ హమ్ద వన్నిఅమత

లక వల్ముల్క్, లా షరీక లక్"[1]. పురుషుడు దీన్ని బిగ్గరగా చెప్పాలి. అలాగే మహిళ కూడా చెప్పాలి, కాని పరాయిపురుషుల సమక్షంలో బిగ్గరగా చెప్పకూడదు. ముఖ్యంగా, స్థితిగతులు మారినప్పుడు (ఎత్తైన ప్రదేశానికి ఎక్కినప్పుడు, దిగినప్పుడు, రాత్రి రావడం లేదా పగలు రావడం) తల్బియాను ఎక్కువగా చదవడం ఉత్తమం.

తల్బియా చేసే సమయం: ఉమ్రా: ఇహ్రామ్‌లో ప్రవేశించిన నాటి నుండి తవాఫ్ ప్రారంభించే వరకూ తల్బియా చదవాలి.

ఇహ్రామ్‌లో ఉన్నవారు, తమ ఇహ్రామ్‌ను ముగించే వరకు ఇహ్రామ్ నిషేధితమైన పనులను చేయకుండా జాగ్రత్తగా ఉండాలి.

---

[1] లబ్బైక్" అనే మాట యొక్క అర్థం: దీని అర్థం: "నేను నీ పిలుపుకు మరలా మరలా ప్రతిస్పందిస్తున్నాను, ఓ నా ప్రభువా!" ఇది ఒక వ్యక్తి అల్లాహ్ పిలుపుకు జవాబు ఇవ్వటం, ఆయన ఆదేశాలను అనుసరించడం, ఆయనకు విధేయత చూపడాన్ని సూచిస్తుంది. "ఇన్నల్ హమ్ద వన్నిఅమత లక వల్ముల్క్" అనే వాక్యం యొక్క అర్థం: "అల్-హమ్దు" అంటే: పరిపూర్ణమైన స్తుతులను ప్రేమతో మరియు గౌరవంతో అల్లాహ్‌కు సమర్పించుట. దీనిని మరల మరల చెప్పడం "గొప్పతనాన్ని" సూచిస్తుంది. "అన్-నిఅమా" అంటే: అల్లాహ్ తన దాసులపై చూపించే అనుగ్రహం, అంటే కావలసినదాన్ని ఇవ్వడం, అప్రియమైన దాన్ని తొలగించడం. "వల్ముల్క్" అంటే: సర్వాధికారం నీకే. అల్లాహ్ మాత్రమే యాజమాన్యం కలవాడు. "లా షరీక లక్" అనే మాట యొక్క అర్థం: అల్లాహ్ కు మాత్రమే ప్రత్యేకమైన పరిపూర్ణ గుణాలలో ఆయనకు ఎవరూ భాగస్వాములు లేరు. సృష్టిని సృష్టించడంలో, నిర్వహించడంలో మరియు ఆరాధనకు అర్హుడు కావడంలో ఆయన అద్వితీయుడు. (మూలం: "మజ్మూఅ ఫతావా వ రసాయిల్ అల్-ఉసైమీన్" (22/96) నుండి సంక్షిప్తం.)

## మూడోవది: తవాఫ్ విధానము

ఇహ్రామ్ ధరించినవాడు మస్జిద్ అల్ హరామ్‌లో ప్రవేశించినప్పుడు, అతను తన కుడి కాలు ముందుగా ఉంచి, మస్జిద్‌లో ప్రవేశించే దుఆ చదవటం సున్నత్. అందులో అత్యంత సరైనది: "అల్లాహుమ్మఫ్తహ్ లీ అబ్వాబ రహ్మతిక" (అల్లాహ్, నాపై నీ కృపా ద్వారాలను తెరువు).

ఈ దుఆ ఏదైనా మస్జిద్‌లో ప్రవేశించినప్పుడు చెప్పవచ్చు, ఇది కేవలం మస్జిద్ అల్ హరామ్‌కు ప్రత్యేకమైనది కాదు.

మరియు అతను తవాఫ్ చేయడానికి ప్రారంభించాలనుకుంటే, అతను "ఇజ్తిబా" చేస్తాడు. ఇజ్తిబా యొక్క విధానం ఏమిటంటే: అతను తన రిదా (పై వస్త్రం) మధ్య భాగాన్ని తన కుడి భుజం కింద నుండి తీసి దాని రెండు చివర్లను ఎడమ భుజంపై వేస్తాడు. తవాఫ్ పూర్తి అయిన తర్వాత, అతను తన రిదా (పై వస్త్రాన్ని) తవాఫ్‌కు ముందు ఉన్న స్థితికి తిరిగి వేస్తాడు, ఎందుకంటే ఇజ్తిబా యొక్క స్థలం తవాఫ్ మాత్రమే.

అతను హజ్రె అస్వద్ వైపుకు వెళ్లి, తన కుడి చేతితో తాకి ముద్దు పెట్టుకోవాలి. తాకడం సాధ్యం కాకపోతే: కుడి చేతితో తాకి, చేతిని ముద్దు పెట్టుకోవాలి.

అది కూడా సాధ్యం కాకపోతే, కట్టి లేదా ఇతర వస్తువుతో తాకి, దానిని ముద్దు పెట్టుకోవాలి.

ఇవేమీ సాధ్యం కాకపోతే, హజ్రె అస్వద్ ఎదురుగా నిలబడి, కుడి చేతితో దాని వైపు సైగ చేయాలి. ఈ సమయంలో చేతిని ముద్దు పెట్టుకోవాల్సిన అవసరం లేదు.

అత్యుత్సాహంతో ఇతరులను నెట్టివేయడం, నష్టపరిచడం మంచిది కాదు. ప్రయత్నించేటప్పుడు ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా ఉండటం ఉత్తమం.

హజ్రె అస్వద్ ను తాకేటప్పుడు లేదా దాని వైపుకు సైగ చేసేటప్పుడు "అల్లాహు అక్బర్" అని చెప్పాలి.

తదనంతరం కుడివైపు తిరిగి కాబా తన ఎడమవైపు ఉండేలా తావాఫ్ ప్రారంభించాలి. రుక్నుల్ యమాని వద్ద చేరుకున్నప్పుడు, దాన్ని తాకాలి కానీ ముద్దుపెట్టుకోవద్దు. తాకడం సాధ్యపడకపోతే, దానిని తాకటానికి ప్రజలను తోసుకోవద్దు లేదా దాని వైపుకు సైగ చేయకూడదు.

రుక్నె యమానీ మరియు హజ్రె అస్వద్ మధ్య ఇలా పలకాలి:

﴿... رَبَّنَآ ءَاتِنَا فِي ٱلدُّنۡيَا حَسَنَةٗ وَفِي ٱلۡأٓخِرَةِ حَسَنَةٗ وَقِنَا عَذَابَ ٱلنَّارِ﴾

ఓ మా ప్రభూ! మాకు ఇహలోకంలో మంచిని మరియు పరలోకంలో కూడా మంచిని ప్రసాదించు మరియు మమ్మల్ని నరకాగ్ని నుండి కాపాడు! [అల్ బఖర: 201]

మరియు ప్రతిసారీ హజ్రె అస్వద్ దగ్గరకు వచ్చినప్పుడు, తన చేతితో దాని వైపు సైగ చేస్తూ "అల్లాహు అక్బర్" (అల్లాహ్ గొప్పవాడు) అని పలకాలి.

మిగతా తవాఫ్ లో తమకు ఇష్టమైన అల్లాహ్ స్మరణలను,దుఆలను మరియు ఖుర్ఆన్ పారాయణమును చేయాలి.

సున్నత్ ఏమిటంటే, తొలి మూడు ప్రదక్షణలలో మాత్రమే రమల్ చేయాలి. రమల్ అంటే, అడుగులను దగ్గరగా వేస్తూ వేగంగా నడవడం. మిగతా నాలుగు ప్రదక్షణలలో రమల్ లేదు, అలవాటు ప్రకారం సాధారణంగా నడవాలి.

కాబట్టి, తవాఫ్‌ను పూర్తిచేసిన తరువాత,మఖామె ఇబ్రాహీం వైపుకు వెళ్లి ఇలా చదవాలి:

﴿...وَٱتَّخِذُواْ مِن مَّقَامِ إِبۡرَٰهِـۧمَ مُصَلًّىۖ...﴾

...ఇబ్రాహీమ్ నిలబడిన చోటును మీరు నమాజ్ చేసే స్థలంగా చేసుకోండి... [అల్ బఖర: 125] ఆ తరువాత, అక్కడ సాధ్యమైనంతవరకు, దాని వెనుక రెండు రకాతులు నమాజు చదవాలి. అది సాధ్యం కాకపోతే, మస్జిద్‌లో ఎక్కడైనా చదవాలి. మొదటి రకాతులో ఫాతిహా తర్వాత

﴿قُلۡ يَٰٓأَيُّهَا ٱلۡكَٰفِرُونَ1﴾

ఇలా అను: "ఓ సత్యతిరస్కారులారా! [అల్- కాఫిరూన్ 109:1] రెండవ రకాతులో ఫాతిహా తరువాత

﴿قُلۡ هُوَ ٱللَّهُ أَحَدٌ1﴾.

ఇలా అను: "ఆయనే అల్లాహ్! ఏకైకుడు. [అల్ ఇఖ్లాస్:1]

## నాల్గవది: సయీ విధానం:

తవాఫ్ మరియు ఆ తర్వాతి రెండు రకాతులు పూర్తైన తర్వాత, అతను సయీ కోసం సయీ చేసే ప్రదేశమునకు వెళ్లాలి. సఫా దగ్గరికి చేరుకున్నప్పుడు ఇలా చదవాలి:

﴿إِنَّ ٱلصَّفَا وَٱلۡمَرۡوَةَ مِن شَعَآئِرِ ٱللَّهِ...﴾

నిశ్చయంగా, 'సఫా మరియు మర్వాలు అల్లాహ్ చూపిన చిహ్నాలు... [అల్ బఖర: 158]

ఆ తరువాత ఇలా పలకాలి:

«أَبْدَأُ بِمَا بَدَأَ اللهُ بِهِ».

«అల్లాహ్ ప్రారంభించిన స్థలం నుండే నేను కూడా ప్రారంభించుచున్నాను»[1].

తర్వాత, అతను సఫా పైకి ఎక్కి కాబా లేదా దాని దిశను చూస్తాడు. అతను ఖిబ్లాకు అభిముఖమై అల్లాహ్‌ను ఏకైకుడిగా ప్రకటించి, అతన్ని గొప్పవాడిగా పేర్కొంటాడు. అతను ఈ దుఆ చదవుతాడు:

«لَا إِلَهَ إِلَّا اللهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ، لَهُ الْمُلْكُ وَلَهُ الْحَمْدُ، وَهُوَ عَلَى كُلِّ شَيْءٍ قَدِيرٌ، لَا إِلَهَ إِلَّا اللهُ وَحْدَهُ، أَنْجَزَ وَعْدَهُ، وَنَصَرَ عَبْدَهُ، وَهَزَمَ الْأَحْزَابَ وَحْدَهُ»،

«అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హులు ఎవరూ లేరు, ఆయన ఒక్కడే. ఆయనకు భాగస్వాములు ఎవ్వరూ లేరు. రాజ్యాధికారము ఆయనదే. సర్వ స్తోత్రములు ఆయనకే చెల్లును. ఆయనే అన్నింటిపై

---

[1] దీనిని ముస్లిం ఉల్లేఖించారు, హదీసు సంఖ్య (1218)

అధికారం కలవాడు. అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హులు ఎవరూ లేరు, ఆయన ఒక్కడే. ఆయన తన వాగ్దానాన్ని నెరవేర్చాడు. తన దాసునికి సహాయం చేసాడు, ఆయన ఒక్కడే శత్రు వర్గాలను చిత్తుగా ఓడించాడు.» ఆ తరువాత దాని మధ్య దుఆ చేసేవారు.(ఆ తరువాత) ఇలా మూడు సార్లు పలికేవారు.[1].

తర్వాత, అతను సఫా నుండి మర్వా వైపుకు సాధారణంగా నడుస్తూ వెళ్లాలి. గ్రీన్ లైట్(ఆకుపచ్చ సూచకం) దగ్గరికి చేరుకున్నప్పుడు, వేగంగా పరిగెత్తాలి. రెండో గ్రీన్ లైట్ దగ్గరికి చేరుకున్న తర్వాత, మళ్ళీ సాధారణంగా నడవాలి. మహిళలకు ఈ వేగంగా పరిగెత్తడం సున్నత్ కాదు.

కాబట్టి, అతను మర్వా చేరుకున్నప్పుడు, సఫాలో చేసిన విధంగా చేయడం ధర్మబద్ధంగా నిర్ణయించబడింది (పేరాగ్రాఫ్ సంఖ్య 2).

తర్వాత, అతను మర్వా నుండి సఫా వైపుకు సాధారణంగా నడుస్తూ వెళ్లాలి. గ్రీన్ లైట్ (ఆకుపచ్చ సూచకం) దగ్గరికి చేరుకున్నప్పుడు, వేగంగా పరిగెత్తాలి. రెండో గ్రీన్ లైట్ దగ్గరికి చేరుకున్న తర్వాత, మళ్ళీ సాధారణంగా నడవాలి.

ఈ విధంగా ఏడు ప్రదక్షిణలు పూర్తవుతాయి. సఫా నుండి మర్వాకు వెళ్లటం ఒక ప్రదక్షిణ మరియు మర్వా నుండి సఫాకు మరలటం ఇంకొక ప్రదక్షిణ అవుతుంది.

---

[1] దీనిని ముస్లిం ఉల్లేఖించారు హదీసు సంఖ్య (1218)

సయీలో తమకు ఇష్టమైన అల్లాహ్ స్మరణలను,దుఆలను మరియు ఖుర్ఆన్ పారాయణమును చేయాలి.

## ఐదవది: శిరో ముండనం, జుట్టు కత్తిరించే విధానం

ఉమ్రా చేసే వ్యక్తి తన తవాఫ్ మరియు సయీని పూర్తి చేసిన తర్వాత, అతను పురుషుడైతే, తన తల మొత్తం ముండనం చేయించుకోవాలి లేదా జుట్టు కత్తిరించుకోవాలి. సున్నత్ ఏమిటంటే, గుండు చేయడం లేదా జుట్టు కత్తిరించుకోవడం తల మొత్తం పై అమలు చేయాలి.

గుండు చేయడం (హల్క్) జుట్టు కత్తిరించుకోవటం (తక్సీర్) కంటే ఉత్తమం. అయితే, హజ్ సమీపంలో ఉంటే, మరియు తలమీద మళ్లీ వెంట్రుకలు పెరిగేందుకు సమయం ఉండకపోతే, కేవలం జుట్టు కత్తిరించుకోవటం ఉత్తమం.

స్త్రీ విషయంలో, ఆమె తన జుట్టు చివర్ల నుండి ఒక అంగుళం అంత పరిమాణంలో కత్తిరించుకోవాలి.

## ఇహ్రామ్ ధరించిన వ్యక్తిపై గల నిషేధాలు

ఇహ్రామ్ యొక్క నిషేధితాలు ఇవి:

శిరోముండన చేయడం, కేశాన్ని కత్తిరించడం లేదా పీకడం, శరీరంలోని ఏ భాగం నుండైనా.

2. రెండు పాదాల లేదా రెండు చేతుల గోర్లు పూర్తిగా లేదా కొంత కత్తిరించడం.

తలను శరీరమునకు దగ్గరగా ఉండే ఏదైనా వస్తువుతో కప్పడం, ఉదాహరణకు: టోపీ, గుత్రా, పాగా, లేదా తలపై రిదా (పై బట్ట) వేయడం, లేదా రుమాలు, బ్లాంకెట్, కార్డ్బోర్డ్, లేదా ఇతర ఏదైనా కప్పడం ఉద్దేశ్యంతో ఉపయోగించే వస్తువు. ఇది పురుషులకు మాత్రమే వర్తిస్తుంది, స్త్రీలకు కాదు.

సాధారణంగా శరీరానికి సరిపడి కుట్టిన దుస్తులను ధరించడం, ఉదాహరణకు: కుట్టిన దుస్తులు, ప్యాంట్లు, కుర్తా,దస్తానాలు, గ్లోవ్స్. ఇది పురుషులకే ప్రత్యేకం, స్త్రీలకు వర్తించదు.

నిఖాబ్, బుర్ఖా లేదా నిఖాబ్‌తో సమానమైన ముసుగు ధరించడం నిషిద్ధం. అయితే, పరాయి పురుషుల సమక్షంలో స్త్రీ తన ముఖాన్ని సాధారణంగా వాడే ముఖావరణంతో కప్పుకోవాలి. ముఖానికి తగిలినా పరవాలేదు. కానీ ముఖాన్ని తగలకుండా ప్రత్యేకమైన వస్త్రాన్ని (అడ్డు పెట్టుకునే వస్త్రాన్ని) ఉపయోగించడం షరియత్ పరంగా ప్రామాణిక ఆధారంతో సమర్థించబడదు.

(స్త్రీలు) తమ చేతులకు గ్లౌజులు (చేతి తొడుగులు) ధరించడం నిషిద్ధం. అయితే, పరాయి పురుషులు ఉన్నప్పుడు స్త్రీలు తమ చేతులను తమ అబాయా (బుర్ఖా) లోపల ఉంచుకోవడం ద్వారా లేదా ఇతర వస్త్రంతో కప్పుకోవడం తప్పనిసరి..

శరీరానికి లేదా ఇహ్రామ్ వస్త్రాలకు సుగంధద్రవ్యాలను ఉపయోగించడం నిషిద్ధం.

అరణ్యపు వేటప్రాణిని వధించడం, లేదా వేటాడడం (చంపకపోయినా).

తన కొరకు లేదా ఇతరుల కొరకు వివాహ సంబంధము నిశ్చయించడం నిషిద్ధము.

నికాహ్ చేయటం నిషిద్ధం.

సంభోగానికి దారితీసే క్రియలు, ఉదాహరణకు ముద్దుపెట్టుకోవడం, శృంగార భావంతో స్పర్శించడం, నిషిద్ధం.

జిమా అంటే స్త్రీ మర్మాంగములో సంబోగించడం.

## ఉమ్రా కార్యాచరణ సంక్షిప్త వివరణ (చివరి పేజీ కవర్ పేజీలో ఉంది)

1. గుసుల్ చేయటం.

2 - సుగంద ద్రవాలు పూసుకోవడం.

3. ఇహ్రామ్ దుస్తులను ధరించటం.

ఇహ్రామ్ అంటే (హజ్,ఉమ్రా విధుల) ఆచరణలలోకి ప్రవేశించే సంకల్పం చేయుట.

తల్బియ

కాబాగృహ ప్రదక్షిణలు.

మఖామే ఇబ్రాహీం వెనుక రెండు రకాతుల నమాజు చదవటం

8. సఫా మరియు మర్వాల మధ్య సయీ చేయడం.

9. శిరో ముండనం లేదా వెంట్రుకలు కత్తిరించటం

మరియు అల్లాహ్ కు బాగా తెలుసు. మరియు అల్లాహ్ మన ప్రవక్త అయిన ముహమ్మద్ పై శుభాలను, శాంతిని కలిగించుగాక.

# విషయసూచిక

ఉమ్రా యొక్క విధానము మరియు దాని నియమ నిబంధనల సంక్షిప్త సంగ్రహం........................................................................ 2

ఉమ్రా యొక్క విధానము మరియు దాని నియమ నిబంధనల సంక్షిప్త సంగ్రహం........................................................................ 2

పరిచయం........................................................................ 3

మొదటిగా: ఆరాధన స్వీకరించబడటానికి అవసరమైన షరతులు........ 3

రెండవది: ఉమ్రా యొక్క విధానం మరియు దాని నియమ నిబంధనలను నేర్చుకోవడం యొక్క ఆదేశం. ........................................................ 5

మూడవది: ఉమ్రా యొక్క విశిష్టత .............................................. 6

ఉమ్రా విధానం ........................................................................ 7

మొదటగా: మీఖాత్‌ల ఆదేశాలు:.................................................. 7

రెండవది: ఇహ్రాం యొక్క విధానం మరియు దాని నియమాలు:.......... 9

మూడోవది: తవాఫ్ విధానము....................................................12

నాల్గవది: సయీ విధానం: ..........................................................15

ఐదవది: శిరో ముండనం, జుట్టు కత్తిరించే విధానం ..........................17

ఇహ్రామ్ ధరించిన వ్యక్తిపై గల నిషేధాలు ........................................17

ఉమ్రా కార్యాచరణ సంక్షిప్త వివరణ (చివరి పేజీ కవర్ పేజీలో ఉంది)....19

te450v1.0 - 06/09/2026